నేటి దినపత్రిక
సూర్య
17 వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం | 24 జులై 2024 | పేజీలు 8

## వేదగిరి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న డాక్టర్ జి.వాణిమోహన్



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలం నరసింహకొండలో వెలసిన శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి, అమ్మవారిని రాష్ట్ర పురావస్తు, మ్యూ జియం శాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి.వాణిమోహన్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా వారికి ఆలయ అధికారులు వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య స్వాగ తం పలుకగా, అనంతరం అర్చకులు వేద ఆశీర్వచనం చేసి స్వామి వారి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా దేవాదాయశాఖ అధికారి జే.శ్రీనివాసరావు, ఆలయ కార్య నిర్వహణాధికారి వి.గిరి కృష్ణ, అర్చక సిబ్బంది, దేవస్థాన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



- వర్షాలతో ఇప్పటికే మొదలైన జ్వరాలు
- పొంచి ఉన్న డెంగీ - పత్తాలేని ఫాగింగ్
- గ్రామాల్లో, పట్టణాల్లో పారిశుద్ధ్య లోపం

# సీజనల్ ముప్పు

**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :**

వర్షాకాలం ప్రారంభమైంది. వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు మొదలయ్యాయి. కొద్ది రోజులుగా జిల్లావ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు ఎక్కడి కక్కడే నీళ్లు నిలుస్తున్నాయి. దోమలు విజృంభిస్తున్నాయి. ఫలితంగా మలేరియా, టైఫాయిడ్, డెంగీ, చికెన్ గున్యా వంటి వైరల్ జ్వరాల కేసులు నమోదవుతున్నాయి. రోగుల తో ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. మరోవైపు విష జ్వరాలు భయపెడుతున్నాయి. వర్షాకాలం మొదలు కావడంతో రకరకాల వ్యాధులు కూడా పొంచి ఉన్నాయి. దోమలే వానాకాలంలో వ్యాధుల వ్యాప్తికి ప్రధాన కారణ మని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా ఇవి నీరు నిల్వ ఉన్న ప్రాంతాలు, మురుగునీటి కాలువలు, చెత్త, అపరిశు భ్రత వాతావరణంలో గుడ్లు పెట్టి బాగా వ్యాప్తి చెందుతా యి. ఇందుకు వీలుగా ఉన్న ప్రాంతాలను గుర్తించి ముం దస్తు చర్యలు యంత్రాంగం తీసుకుంటే.. ఆదిలోనే వ్యాధు లను కట్టడి చేసుకోవచ్చునని పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

### పొంచి ఉన్న డెంగీ..

వర్షాకాలం మొదలు కావడం తో డెంగీ ముప్పు పొంచి ఉంది. వాస్తవానికి దోమల వృద్ధి చెందడంతో ఫలితంగా డెంగ్యూ ముప్పు కూడా పొంచి ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మిగతా జ్వరాలతో పోలిస్తే డెంగ్యూలో మరణాలు సంభవిస్తుంటాయి. దానికి కారణం ప్లేట్ లెట్లు పడిపో వడం రక్తం రక్తకణాలతో పాటు ప్లేట్లెట్స్ కూడా ఉంటా యి. ఇవి శరీరానికి గాయం అయినప్పుడు రక్తం గడ్డ కట్టేలా చేస్తాయి. ఇవి లేకపోతే శరీరంలో ఇంటర్నల్ బ్లీడింగ్ జరుగుతుంది. మామూలుగా ఒక వ్యక్తిలో ఇవి 1.5 లక్షల నుంచి 4.5 లక్షల వరకు ఉంటాయి. డెంగ్యూ సోకినప్పుడు నీటి శాతం తగ్గిపోతుంది. ఒక్కో సారి ఈ వ్యాధిని గుర్తించేటప్పటికీ పరిస్థితి చేయి దాటి పోవచ్చు. అయితే జ్వరం వచ్చినప్పుడు శరీరంలో రక్త కణాల సంఖ్య తగ్గిపోవడం సర్వసాధారణం. ప్రతి జ్వరా న్ని డెంగ్యూగా భయపెట్టి ప్రైవేట్ ఆసుపత్రిలో దోపిడీకి పాల్పడుతున్నాయని వ్యాఖ్యలు వ్యక్తం అవుతున్నాయి. 50 వేలకు పైగా రక్త కణాలు ఉన్న ఐసీలో ఉంచి అదనంగా కణాలు ఎక్కిస్తున్నారు. ఈ జ్వరాల వలన ప్రైవేటు ఆసుపత్రుల్లో

-మిగతా 2లో






రోడ్డుకు దూరంగా, పొలాల్లో నివాసాలు ఏర్పరుచుకున్న గిరిజనులు (యానా దులు) ప్రభుత్వ నిర్లక్ష్యంతో తాటాకు పూరి గుడిసెలకే పరిమితమై నివాసా లుంటూ దుర్భర పరిస్థితితో కొనసాగుతున్న వైనమిది.

# దుర్భరం.. అశ్వినీపురం గిరిజన వాసం

- నిధులు రాక.. నిర్మాణాలు సాగక !
- గుడిసెలకే పరిమితం..

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం నువ్వురుపాడు మజరా అశ్వనీపురం సమీపంలోని పొలాల మధ్య జీవనం సాగిస్తున్న గిరిజనులు పలువురు దశాబ్ద కాలంగా పక్కా గృహాలకు నోచుకోవడం లేదు. గతంలో పొలాల మధ్య తాటాకు పూరి గుడిసెలు నిర్మించుకున్న ఆ గిరిజనుల్లో 12 మందికి ప్రభుత్వం పక్కా గృహాలు మంజూరు చేయగా నిర్మించుకున్నారు. మిగతా 15 మందికి పదేళ్ళ క్రితం పక్కా గృహాలు మంజూరు కాగా, ఆ గిరిజనులు ఉన్న ఇళ్ళను తొలగించి పక్కా గృహాల నిర్మాణాలు ప్రారంభించి.. ఆ ప్రక్కనే పూరిగుడిసెలు నిర్మించుకొని నివాసాలుండ సాగారు. తీరా చూస్తే.. వారికి బిల్లులు మంజూరు కాలేదు. దీంతో ఇళ్ళ నిర్మాణ పనులు నిలిచిపోయా యి. ఇక ఆ విషయం గురించి ఎందరికి మొరపెట్టు కున్నా.. ఎవరూ పట్టించుకోనందున వారికి స్వంతం గా ఇళ్ళు నిర్మించుకునే స్థోమత లేక కూలీ నాలీ పనుల ద్వారా జీవనం సాగిస్తూ.. తాటాకు పూరి గుడిసెల నివాసాలకే పరిమితమయ్యారు. గిరిజనులకు ఎన్నెన్నో పథకాలు అంటున్న ప్రభుత్వాలు వారు అనాదిగా రహదారులు, సైడు కాలువలు, తాగునీటి వసతి లేకుండా నానా అవస్థలు పడుతుండగా, ఏడాదిన్నర క్రితం సిమెంటు రోడ్లు నిర్మించారు. తాగు నీరు అందిస్తున్నారు. సైడు కాలువలు మాత్రం నిర్మించలేదు. కాగా రెండు కుటుంబాల వారు పక్కా గృహ నిర్మాణ పనులు నిలిచిపోగా, పక్కనే పూరి గుడిసెలు నిర్మించుకొని నివాసం ఉంటుండగా రెండేళ్ళ క్రితం ఆగుడిసెలు అగ్నికి ఆహుతయ్యాయి. వారికి ప్రభుత్వం నుండి ఎలాంటి ఆర్థికసాయం అందించకపోగా కనీసం వారికైనా పక్కా గృహాలు మంజూరు చేయలేదని వారు ఆవేదనతో తెలిపారు. తమకు గతంలో నిలిచిపోయిన గృహాల బిల్లులు చెల్లించి వాటిని పూర్తి చేసుకునే అవకాశం కల్పించా లని, ఇంకా అవసరమైన వారికి పక్కా గృహాలు మంజూరు చేయాలని పదే పదే ఏళ్ళ తరబడి విలేకరులకు విన్నవించినా, అధికారులు, ప్రజాప్రతి నిధులు, నాయకులకు మొరపెట్టుకుంటున్నా ఏమాత్రం ఫలితం లేకపోతుందని

-మిగతా 2లో



## పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

**బోగోలు, మేజర్‌న్యూస్ :** బిట్రగుంట రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం తెల్లవారుజామున కృష్ణ పట్నం పోర్ట్ నుండి గోండియా, వాడ్స గూడ్స్‌రైలు ప్రమాదానికి గురైంది. బిట్రగుంట రైల్వేస్టేషన్‌లోని లూప్ లైన్‌లోకి గూడ్స్‌రైలు వస్తున్న సందర్భంలో రైలు పట్టాలు తప్పింది. గుర్తురాలి ప్రమాదానికి గురి కావ డంతో పలు రైలు ఆలస్యంగా నడిచాయి. సమాచారం అందుకున్న రైల్వే ఉన్నతాధికారులు హుటాహుటినా ఘటన స్థలానికి చేరుకొని గూడ్స్ రైలు భోగీలను తొలగించారు.

## పారిశుద్ధ్య నిర్వహణను ప్రణాళికాబద్ధంగా చేపట్టండి

### అదనపు కమిషనర్ శర్మద



నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో అన్ని డివిజనుల్లో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని అదనపు కమిషనర్ శర్మద ఆదేశించారు.

3లో

## దొంగ జాలరి దొరికితే లైసెన్సు రద్దు

### మత్స్య శాఖ ఏడీ శ్రీనివాసులు - సూర్య కథనానికి స్పందన



**అనంత సాగరం, మేజర్‌న్యూస్ :** గుట్టుచప్పుడు కాకుం డా జలాశయంలో నిషేధిత వేట సాగిస్తున్న వారిపై నిఘా ఉంచుతామని, ఒక్క చేపతో దొంగ జాలరి దొరికి న లైసెన్సులు రద్దు చేస్తామని మత్స్య శాఖ ఏడి శ్రీనివా సులు అన్నారు. జలాశయంలో 'ఆగని అక్రమ మత్స్య వేట' సూర్య కథనానికి స్పందించిన అధికారి మంగళ వారం ప్రాజెక్టుకు విచ్చేశారు. జలాశయ లోతట్టు పరి సర ప్రాంతాల్లో పరిశీలనలు చేపట్టారు. అనంతరం వ్యాపారస్తులకు, జాలర్లకు పలు హెచ్చరికలు జారీ చేశా రు. ఎన్నిమార్లు హెచ్చరిస్తున్నా.. కొందరు స్వార్థపరులు అక్రమ వేటకు తెగబడుతూ ఉండటం ఇక ఉపేక్షించే పరిస్థితి లేదన్నారు. ఎవరు బయట నుండి స్థానికేతర జాలర్లను తెచ్చి నిషేధిత అలివి వలలతో వేట సాగిస్తు న్నారన్నది తనవద్ద ఓ జాబితా ఉందన్నారు. దొంగ ఆటలు, వేటలు సాగిస్తున్న వారు పట్టుబడిన రోజు శాఖాపర చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. స్వార్థప రులు మాత్రం కుబేరులవుతున్నారని, కూలి కోసం వచ్చి న స్థానికేతర జాలర్లు మాత్రం అన్ని విధాల చితికిపో తున్నారని అధికారి తెలపడం విశేషం. పద్ధతి మార్చుకో వాలని, లేదంటే ఇక మాటలు ఉండవని తీవ్ర చర్యలను రుచి చూస్తారని వారిపై మండిపడ్డారు. కార్య క్రమంలో సచివాలయ మత్స్యశాఖ ఉద్యోగిని చందన పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు పాటించాలి

**- వైద్యాధికారిణి డాక్టర్ అస్మా**

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు సోకకుండేలా సిబ్బంది ప్రజలకు అన్నీ సలహాలు, సూచనలు చేసి అందరూ జాగ్రత్తలు పాటించేలా చూడాలని ఆత్మకూరు అర్బన్ ప్రాధమికారోగ్యకేంద్ర వైద్యాధికారిణి డాక్టర్ షేక్ అస్మా సూచించారు. మంగళవారం యుహెచ్ సి వద్ద సిబ్బందికితో సెక్టార్‌మీటింగ్ నిర్వహించి ప్రసంగించారు. గతవారం రోజులుగా వర్షాలు కురుస్తున్నందున జ్వరాలు, డయేరియా సోకే అవకాశాలుంటాయని ఆమె పేర్కొన్నారు. కాబట్టి అన్నీ జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆమె తెలిపారు. ప్రతిశుక్రవారం డ్రేడేగా పాటించాలని, ఇళ్ళ పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలంటూ ప్రజలకు అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. ఇళ్ళలో, పరిసరాల్లో కొబ్బరిచిప్పలు, పాత టైర్లు, పాతప్లాస్టిక్ బిందెలు, డబ్బాలు తొలగించాలని, నీరు నిల్వలేకుండా చూడాలని, వారంరోజులు నీరు నిల్వ ఉంటే ఎడిస్ దోమలు ఉత్పత్తి అవుతాయని, తద్వారా డెంగ్యు, చికెన్‌గున్యా వ్యాధులు సంక్రమిస్తాయని డాక్టర్ అస్మా పేర్కొ న్నారు. మురుగునీరు నిల్వ ఉన్నప్రాంతంలో ఫిమేల్ ఎనాసిలస్ దోమ ఉత్పత్తి అయి తద్వారా మలేరియా సోకే అవకాశం ఉందన్నారు. క్యూలెక్స్ దోమల వలన పైలేరియా లాంటి వ్యాధులు వస్తాయన్నారు. నీటిని నిల్వ లేకుండా చూసుకోవాలంటూ ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యపరచాలని ఆమె



సిబ్బందిని కోరారు. నీరు నిల్వ ఉన్నచోట్ల అబ్బేట్ అనే క్రిమిసంహారక మందు, వేస్ట్ ఆయిల్‌లను వేయాలన్నారు. కాలువల్లో వ్యర్థాలుంటే మున్సిపల్ శానిటరి సిబ్బందికి తెలియజేయాలని, మున్సిపా లిటీ ద్వారా క్లోరినేషన్ చేసిన నాటిని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని ఆమె కోరారు. వాటర్ పైపుల లీకేజిలుంటే వెంటనే సంబంధిత అధికారులదృష్టికి తీసుకెళ్ళాలన్నారు. తాజాగా తయారు చేసి వేడిగా ఉన్న పధార్ధాలను భుజించాలని, బజార్లలో విక్రయించే పానీపూరి లాంటి పధార్ధాలు, ఈగలు వాలే పధార్ధాలు తినారాదని కూడా తెలియజేయాలని డాక్టర్ అస్మా సూచిం చారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ సిద్ధం సుధాకర్, యు.పార్వతమ్మ, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులు గణితం పట్ల మక్కువ పెంచుకోవాలి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :**

విద్యార్థులు గణితం పట్ల మక్కువ పెంచుకోవాలని ఆత్మకూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని అనంతలక్ష్మి కోరారు. పాఠశాలలో శిక్షసప్తాహ్ కార్యక్రమంలో భాగంగా రెండవరోజు మంగళవా రం పునాది అభ్యసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనంతలక్ష్మి మాట్లాడుతూ.. గణితం పట్ల ఆసక్తి పెంచుకుంటే సులభతరంగా ఉంటుందన్నారు. గణితంలో విద్యార్థులకు మానసికానందంతోపాటు సృజనాత్మకత అలవడుతుందన్నారు. భాషలో కనీస అభ్యసనా స్థాయిలను సాధించేలా విద్యార్థులు తయారు కావాలని ఆమె కోరారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన గణిత అంశాలను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సీజనల్ ముప్పు !

(మొదటి పేజీ తరువాయి)

వేలాది రూపాయలను వెచ్చించాల్సిన పరిస్థితి దాపరించక ముందే తగు జాగ్రత్తలు వహించాల్సి ఉంది.

**పత్తాలేని ఫాగింగ్ :**

జిల్లావ్యాప్తంగా గ్రామాల్లో పట్టణాల్లో ఫాగింగ్ పత్తా లేకుండా పోయిందని వ్యాఖ్యలు వ్యక్తం అవుతున్నాయి. పలు పంచాయితీల్లో ప్యాకింగ్ యంత్రాలు ఉన్న నిధులు కొరతతో ప్రత్యేక పాలనలో వాటిని ముట్టుకోవడం లేదని పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోవడం లేదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ప్రతి ఏటా



వర్షాకాలంలో ఫాగింగ్ యంత్రాలతో దోమల నివారణ చర్యలు చేపట్టే వారిని ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదని ప్రజలు వాపోతున్నారు. అంతేకాకుండా గ్రామాల్లో పారిశుధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఫలితంగా దోమలు ఈగలు వ్యాపిస్తున్నాయి. అధికార యంత్రాంగం ముందుగానే జాగ్రత్తలు తీసుకుంటే ప్రజలను వ్యాధుల వ్యాధి నుండి రక్షించవ చ్చు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు నివారణ కోసం తీసుకో వాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించాలి. తాగునీటి పైపులైన్ల మరమ్మత్తులు, వాటర్ ట్యాంకులను శుభ్రం చేయడం, బ్లీచింగ్ పొడి చల్లడం, క్లోరినేషన్ చేయడం తదితర ప్రత్యేక చర్యలు సంబంధిత అధికారులు సమన్వయం చేసుకుంటూ సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా కట్టడి చేయాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

# దుర్భరం.. అశ్వనీపురం గిరిజన వాసం

(మొదటి పేజీ తరువాయి)

వారు తీవ్ర ఆవేదనతో తెలిపారు. ఆత్మకూరు నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా గృహాలకు సంబంధించి బకాయిలు ఇక హుళక్కేనా.. అని పలువురు చర్చించుకుంటున్నా రు. గత ప్రభుత్వం తొలుత రాష్ట్ర విభజనతో గృహ నిర్మాణానికి సంబంధించి ప్రత్యేక ఆన్‌లైన్ ఖాతాలు ఏర్పడనందున బిల్లుల చెల్లింపు నిలిచిపోయిందని అప్పట్లో అధికారులు చెబుతుండేవారు. అప్పట్లో నూతన ప్రభుత్వం ఏర్పడ్డాక నియోజకవర్గంలో 19,239 గృహాలు పూర్తికాగా, 3815 గృహాలు వివిధ దశల్లో ఉండేవి. 9242 మంది గృహాల నిర్మాణాలు ప్రారంభించలేదని తెలిపారు. 2014లో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడగా వివిధ కారణాలతో మూడేళ్ళ తరువాత గృహ నిర్మాణ కార్యక్రమం ఆరంభమైంది. అప్పటికే ఆత్మకూరు మండలంలో 150 గృహాల నిర్మాణాలు నిలిచిపోగా, దాదాపు 50 లక్షల రూపాయల బకాయిలుండేవి. అశ్వనీపురం గిరిజన కాలనీలో 14 ఇళ్ళ నిర్మాణం నిలిచిపోయి ఈనాటికీ పునాదులకే పరిమితమై కనిపిస్తున్నాయి. వారికి బిల్లులు చెల్లించనందున నిర్మాణం కొన సాగించలేక పూరి గుడిసెల్లో జీవనం సాగిస్తున్నారు. నాలుగు చినుకులు పడినా తమ అవస్థలు వర్ణనాతీతంగా ఉంటాయని వారు వాపోతున్నారు. తాము నిరుపేదలం కావడంతో స్వంతంగా ఈ గృహాలను నిర్మించుకోలేకున్నామని వారు చెబుతుంటారు. గతంలో గృహాల నిర్మాణాలు పూర్తి చేసిన పలువురికి తుది బిల్లు కూడా రాలేదని చెబుతున్నారు. నియోజకవర్గం లోని ఆరు మండలాల్లో దాదాపు 3 కోట్ల రూపాయల బకాయిలున్నాయని అప్పట్లో అధికారులు తెలిపారు. నేటి అధికారులను ఆ బకాయిల గురించి అడుగగా ఇంకా చెల్లించలేదని పేర్కొన్నారు. ఏళ్ళు గడిచిపోతున్నా.. ఆ బకాయిల గురించి ఎవరూ పట్టించు కోనందున ఇక హుళక్కే ! అని పలువురు అభిప్రా యపడుతున్నారు. ఇప్పటికైనా నానా అవస్థలు పడుతున్న అశ్వనీపురం గిరిజనుల గృహ



బిల్లులు రాక నిలిచిపోయిన గిరిజనుల గృహం

నిర్మాణ బిల్లులు చెల్లించాలని, లేదా కొత్త ఇళ్ళు మంజూరు చేయాలని వారు కోరుతున్నారు. రెండు నెలల క్రితం అధికారులు వచ్చి తమకు ఇళ్ళు మంజూరు గురించి వివరాలు నమోదు చేసుకున్నారని, అయి నా ఇంకా ఎలాంటి మంజూరులు లేవని వారు పేర్కొన్నారు.

నూతన పాలకులు కానీ, ఉన్నతాధికారులు కానీ స్పందించి ఆ గిరిజనుల తాటాకు గుడిసెల నివాసాలను తప్పించి పక్కా గృహాలు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాల పంపిణీ



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండలంలోని చుంచులూరు ఉన్నత పాఠశాలలో గత సంవత్సరం జరిగిన పదవ తరగతి పరీక్షలలో మొదటి నాలుగు స్థానాలు సాధించిన కలిశెట్టి జ్ఞాపిక, ఇందూరు లక్ష్మీ ప్రసన్న, పవన్ కళ్యాణ్, వనం విజితలకు చింతంరెడ్డి సిద్ధారెడ్డి, జయమ్మల కుమారుడు, పాఠశాల పూర్వ విద్యార్థి,ప్రవాస భారతీయుడైన సుదర్శన్ రెడ్డి రూ.12 వేల నగదు బహుమతులు, మెమెంటోలు మంగళవారం అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడి అభ్యర్ధన మేరకు రూ.22 వేలు విలువ చేసే ప్రింటర్‌ను పాఠశాలకు బహు కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ మాట్లాడుతూ.. విద్యార్థులను ప్రోత్సహించడానికి, పాఠశాల అభివృద్ధికి సహకరించడానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. విద్యార్థులు దాతల సహకా రాన్ని అందిపుచ్చుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కలిశెట్టి వెంకటరమణయ్య, తంగేడుపల్లి సుబ్బయ్య, మల్లేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు బోధనా నైపుణ్యాలు కలిగి ఉండాలి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఉపాధ్యాయులు బోధనానైపుణ్యం కలిగి ఉండాలని, విద్యార్థులకు అర్ధమయ్యే రీతిలో బోధించాలని జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఆత్మకూరులోని ఆంధ్రప్రదేశ్ గురుకుల బాలికల ఉన్నత పాఠశాలను జిల్లా సమగ్రశిక్ష అభియాన్ మానిటరింగ్ అధికారి సుధీర్‌బాబుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. 2023-24లో ఈ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణులు కావడం, 587 మార్కులు సాధించడం గర్వించదగిన విషయమంటూ స్కూల్ ప్రిన్సిపాల్ కామేశ్వరమ్మను వారు అభినందించారు. సాల్ట్ శిక్షణా కేంద్రాన్ని వారు పరిశీలించారు. మిగతా 4 రోజుల శిక్షణా కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసి మిగిలిన ఉపాధ్యాయుల పనితీరును టీచ్‌టూల్‌యాప్ ద్వారా పరిశీలించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఆత్మకూరు డిప్యూటీ డీఈఓ కె.గోపాల్, ఎంఈఓ-1 ఎం.జ్యోతి, ఎంఈఓ-2 చలపతి పాల్గొన్నారు.

## తిలక్, ఆజాద్‌లు ఆదర్శనీయులు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** భారతదేశ స్వాతంత్ర్యం కోసం అందరినీ ఒక్కటిగా చేసి నడిపిన బాల గంగాధర తిలక్, చంద్రశేఖర్ ఆజాద్‌లు ఆదర్శప్రాయులని ఆత్మకూరులోని ఆంధ్రా ఇంజనీరింగ్ కాలేజి ప్రిన్సిపాల్ కిషోర్‌రెడ్డి పేర్కొన్నారు. బాల గంగాధర తిలక్, ఆజాద్‌ల జయంతిని పురస్కరించుకొని మంగళవారం ఇంజనీరింగ్ కాలేజిలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కిషోర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితో దేశభక్తి కలిగి ఉండాలని, బాల గంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్‌లను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఆనాటి యోధుల ఉద్యమ ఫలితంగా భారతదేశానికి స్వాతంత్ర్యం రావడంతో అందరం సంతోషంగా ఉన్నామని పేర్కొన్నారు. విద్యార్థి సంఘం విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందిస్తుండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు దేవానంద్, దేవముని, సుదర్శన్, ఆంధ్ర విద్యార్థి సంఘం నియోజకవర్గ కన్వీనర్ మహంత్‌రెడ్డి, విద్యార్థి సంఘ నాయకులు శ్రీరామ్, మనోజ్, బాలాజీ, త్రినాధ్ తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య నిర్వహణను ప్రణాళికాబద్ధంగా చేపట్టండి

**అదనపు కమిషనర్ శర్మద**



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో అన్ని డివిజనుల్లో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని అదనపు కమిషనర్ శర్మద ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నగరంలోని వివిధ డివిజనుల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను శర్మద మంగళవారం పర్యవేక్షించారు. స్థానిక ఆదిత్య నగర్, రాంజీనగర్, చిల్డ్రన్ పార్కు ప్రాంతాల్లో చెత్తను తరలిస్తున్న నగర పాలక సంస్థ ట్రాక్టర్ల డ్రైవర్లతో మాట్లాడారు. మద్రాస్ బస్టాండ్ ఏ.సి సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్ సమీపంలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడి వివిధ సూచనలు జారీ చేశారు. రోడ్డు వెంబడి ఉన్న యాచకుని మృతదేహాన్ని గుర్తించిన అదనపు కమిషనర్, పోలీసు విభాగం వారికి సమాచారం అందించి, మృతదేహాన్ని తరలించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం సోమశేఖరపురం, పొగతోట ప్రాంతంలో పర్యటించి వివిధ ప్రాంతాల్లో పేరుకున్న చెత్తను తొలగించాలని పారిశుద్ధ్య కార్మికులకు ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్త తరలింపు వాహనాలకు మాత్రమే వ్యర్థాలను అందించాలని స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శానిటేషన్ అధికారులు వెంకటేశ్వర్లు, శేషయ్య, సచివాలయం శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

## రోడ్లపై సంచరిస్తున్న గోవులతో ఇబ్బందులు

**నివారించాలంటూ కమిషనర్‌కు వినతి**



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే సూచనతో నెల్లూరు రూరల్ కార్యాలయం ఇంచార్జ్ కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ఆదేశాలతో 36వ డివిజన్ తెలుగుదేశం నాయకులు బాపనపల్లి శశిధర్ ఆధ్వర్యంలో మంగళవారం నెల్లూరు మున్సిపల్ అదనపు కమిషనర్ శర్మదాను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 36 డివిజన్లో గోవులు, దూడలు అధిక సంఖ్యలో ప్రధాన రహదారుల మీద, ఇళ్ల మధ్యలో.. అలాగే స్కూల్ ప్రాంగణంలో సంచరిస్తున్నాయని, తద్వారా ప్రజలకు, వాహనదారులకు, మహిళలు తీవ్ర ఇబ్బంది గురవుతున్నారని వారు తెలియజేశారు. అదేవిధంగా ఎవరైతే గోవులు పోషకదారులున్నారో వారిని పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి ప్రజలకు కలుగుతున్న ఈ ఇబ్బందులు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. ఈ విషయంపై స్పందించిన అదనపు మున్సిపల్ కమిషనర్ శర్మదా సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఇండ్ల షణ్ముఖేశ్వరరావు, పిల్లిల ధనుంజయ, బాసటి సుజన్, 38 డివిజన్ ఇంచార్జ్ ఉంటే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లావ్యాప్తంగా శిక్షా సప్తహ్ ప్రారంభం



**నెల్లూరు విద్య, మేజర్‌న్యూస్ :** జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఈనెల 29 వరకు శిక్షా సప్తాహ్ పేరుతో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 340 ఉన్నత పాఠశాలలు, 204 ప్రాథమికోన్నత పాఠశాలలు 245 ప్రాథమిక పాఠశాలలున్నాయి. ఈ కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో నిర్వహిం చాలని రాష్ట్ర విద్యాశాఖ నుంచి అన్ని పాఠశాలలకు, విద్యాశాఖ అధికారులకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. 24వ తేదీ వివిధ క్రీడలపై విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తారు. అదేవిధంగా శారీరక సౌష్టవం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తారు. 25వ తేదీ భిన్నత్వంలో ఏకత్వం భావనను విద్యార్థుల పెంపొందించేలా పలు సాంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. 27వ తేదీ సాంకేతిక నైపుణ్యాల దినోత్సవంలో భాగంగా విద్యలో సాంకేతిక అభివృద్ధికి గుర్తించగా చర్చలు జరపాలని నూతన నైపుణ్యాలను గుర్తించాలని తెలిపారు. 27వ తేదీ పర్యావరణ పరిరక్షణలో భాగంగా న్యూట్రిషన్‌డే అమ్మకు అంకితం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 29 నా సామాజిక భాగస్వామ్య దినోత్సవంలో భాగంగా ప్రజలు విద్యార్థులు తల్లిదండ్రులు కలిసి కమిటలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఉపాధ్యాయ సంఘాల సహకారంతో వివిధ కార్యక్రమాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలి. సమగ్ర శిక్ష ఉన్నతాధికారుల ఉత్తర్వుల ప్రకారం జిల్లాలోని అన్ని పాఠశాలలో కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

# చెరువులో వృక్ష సంపదను నిర్లక్ష్యం చేయడం తగునా !



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :**

ఆత్మకూరు చెరువులో అటవీశాఖ ఆధ్వర్యంలో పెంచిన నల్లతుమ్మ వృక్ష సంపదను సంబంధిత అధికారులు అత్యంత నిర్లక్ష్యం వహించారని, రాబడిని వృధా చేశారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి లక్కు కృష్ణప్రసాద్ విమర్శించారు. ఆయన జిల్లా కౌలు రైతు సంఘ నాయకుడు గంటా లక్ష్మిపతి, మండల రైతు సంఘ అధ్యక్షుడు కృష్ణప్రసాద్‌లతో కలిసి మంగళవారం ఆత్మకూరు చెరువును పరిశీలించారు. గతంలో అటవీశాఖ వారు చెరువు లోతట్టు తుమ్మల మొక్కలు వేయడం, అవి పెరిగి పెద్దయినా వాటిని గురించి పట్టించుకోనందున ఎండిపోవడంతోపాటు మట్టిగా మారుతున్న పరిస్థితిని వారు పరిశీలించారు. గతంలో చెరువుల్లో సామా జిక అటవీశాఖ ఆధ్వర్యంలో తుమ్మమొక్కలు నాటితే, అవి పెరిగి పెద్దవయ్యాక వేలం ద్వారా విక్రయించి తద్వారా వచ్చే రాబడిని అటవీ శాఖకు, సాగునీటి సంఘానికి, పంచాయతీకి వాటాగా చెల్లించేవారు. కానీ ఆత్మకూరు చెరువులో దాదాపు 4దవాబ్దాల క్రితం వేసిన తుమ్మ మొక్కలు పెరిగినా వాటిని పట్టించుకోనందున అన్యాక్రాంతం కావడం, ఎండిపోవడం, మట్టిగా మారుతుండడం జరుగుతోంది, ప్రాచిన చరిత్ర కలిగి 1098 ఎకరాల ఆయకట్టు కలిగిన, ఆరు తూములు కలిగిన, క్రమీణా 5600 ఎకరాల ఆయకట్టుగా మారిన ఆత్మకూరు చెరువులోతట్టు వందలాది ఎకరాల్లో తుమ్మ మొక్కలు నాటిని అధికారులు వాటిని గాలికొదిలేశారని లక్కు ప్రసాద్ పేర్కొన్నారు. సకాలంలో వాటని వేలం వేసి ఉంటే అదికమొత్తంలో రాబడి వచ్చి ఉండేదన్నారు. నువ్వురుపాడు వద్ద ఒక తూము ఉండగా సక్రమంగా సాగునీరందడం లేదన్నారు. కాగా చెరువులో తుమ్మచెట్లను వేలం వేసి ఉంటే వివిద పనిముట్లు, పరికరాలు, ఫర్నిచర్‌కు జనాలు అధికంగా పాటలో పాల్గొని కొనుగోలు చేసేవారని, అధిక మొత్తంలో ఆదాయం వచ్చి ఉండేదని ప్రసాద్ పేర్కొన్నారు. ఇప్పటికైనా వంటచెరుకుగానైనా వేలం వేస్తే కొంతమేరకైనా రాబడి లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.

ఈ మేరకు ఆత్మకూరు అటవీశాఖాధికారికి వారు ఒక వినతపత్రం అందజేసి వివరాలు తెలిపారు. ఇరిగే షన్ అధికారులు కూడా ఈ చెట్ల విషయం గురించి పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. ప్రజల ఆస్థి మట్టిపాలవుతుంటే అధికారులు ఏమీ పట్టనట్లుగా వ్యవహరించడం అత్యంత శోచనీయమన్నారు. ఇప్పటికైనా స్పందించాలని లక్కు ప్రసాద్, తదితరులు డిమాండ్ చేశారు.

## గిరిజన నేత పెంచలయ్యపై ఆరోపణలు సరికాదు

**యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర నేత కొమరగిరి చెంచయ్య**



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నిరంతరం గిరిజనుల కోసం పని చేస్తున్న మాజీ అట్రాసిటీ కమిటీ సభ్యులు, యానాదుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాష్ట్ర అధ్యక్షులు కేసి పెంచలయ్య పై శేఖర్ అనే వ్యక్తి అవాస్తవ ఆరోపణ చేయడం సరికాదని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొమరగిరి చెంచయ్య పేర్కొన్నారు. నెల్లూరు నగరంలోని వెన్నెలకంటి రాఘవయ్య భవన్లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశం ఆయన మాట్లాడుతూ.. గిరిజన సంఘ నేత ముసుగులో శేఖర్ దందాలు చేస్తూ నిజంగా పోరాటం చేసే వారిపై అవాస్తవ ప్రచారాలు వేస్తున్నారని విమర్శించారు. గిరిజన నేత చెప్పుకునే శేఖర్ నిజంగా ఎస్టీ కాదని ఒక మహిళ కలెక్టర్‌తో పాటు గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ కు ఫిర్యాదు కూడా చేసి ఉందన్నారు. ఆ ఫిర్యాదు మీద విచారణ ఎదుర్కోలేక యానాది అని నిరూపించుకోలేక తమపై విష ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో యానాదుల సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లి రమేష్, జిల్లా అధ్యక్షులు మాణికల మురళి, రాష్ట్ర నాయకులు తిరువీధి సతీష్, ఎల్లంపల్లి పెంచలయ్య, తలపల చంద్రమౌళి, చెంబెటి ఉషాతదితరులు పాల్గొన్నారు.

## కామాక్షితాయి సేవలో ఐఏఎస్‌లు



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురావస్తు, మ్యూజియం శాఖ కార్యదర్శి డాక్టర్ జి.వాణిమోహన్, తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణ అధికారి జె.శ్యామలరావు సతీమణి శైలజరావు, వారి కుటుంబ సభ్యులు మంగళవారం శ్రీకామాక్షితాయి అమ్మవారి శ్రీచక్ర నవావరణ పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్వభూమి వెంకటశ్రీనివాస్‌రెడ్డి, జిల్లా దేవదాయ శాఖ అధికారి జె.శ్రీనివాస్ రావు అతిథులను ఆలయ మర్యాదలతో స్వాగతించి శ్రీలక్ష్మీ గణపతిస్వామి, శ్రీమల్లికార్జునస్వామి, శ్రీవల్లి దేవసేన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి అష్టోత్తర శతనామార్చన పూజలు చేయించి తదుపరి శ్రీ కామాక్షితాయి అమ్మవారికి శ్రీ చక్ర నవావరణ పూజ జరిపించారు. ఆలయ అర్చకులు అతిథులను శ్రీవార్ల పట్టు వస్త్రములతో సత్కరించి వేద ఆశీర్వచనం తీర్థ ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది, పురావస్తు శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేద పిల్లలకు ఉచిత వైద్య శిబిరం




**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో స్థానిక వెంగళరావు నగర్‌లో ఉచితంగా కావలి చుట్టుపక్కల ప్రాంతాల్లో నిరుపేద విద్యార్థులకు పేదలకు నిరంతరం సంస్థ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అదే క్రమంలో మంగళవారం కూడా గ్రామాల్లో నిరుపేద పిల్లలకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో సుమారు 300 మంది చిన్న పిల్లలు పాల్గొన్నారు. ఈ శిబిరంలో డాక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ మాట్లాడుతూ.. ఈ సంస్థ ఆధ్వర్యంలో ఇలాంటి సేవా కార్యక్రమా లు నిర్వహించడం ఎంతో సంతోషకరమన్నారు. అలాగే సంస్థ వ్యవస్థాప కులు జైపాల్ మాట్లాడుతూ.. ప్రతి నిత్యం పేద ప్రజల కోసం ఈ సంస్థ పని చేస్తుందని, ప్రతి ఒక్క నిరుపేద కుటుంబం ఈ అవకాశాన్ని ఉపయో గించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలోకోరీడ్ సంస్థ సూపర్వైజర్ దంతం సునీల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్లాన్ అమలు చేయండి

### అధికారులను కోరిన మత్స్యకారులు




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** సముద్ర తీరప్రాంత మత్స్యకారుల సాంప్రదాయ జీవన విధానానికి ఇబ్బందులు లేకుండా కోస్టల్‌జోన్ మేనేజ్‌మెంట్ ప్లాన్‌ను అమలు చేయాలని మత్స్యకారులు అధికారులను కోరారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కోస్టల్ జోన్ మేనేజ్ మెంటు ప్లాన్ ఖరారుపై జిల్లా రెవెన్యూ అధికారి లవన్న, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ రాజశేఖర్ ఆధ్వర్యంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణకు బోగోలు, విడవలూరు, మైపాడు, ఇందుకూరుపేట ముత్తుకూరు తదితర మండలాల తీరప్రాంత గ్రామాల నుంచి పలువురు మత్స్యకారులు,పలు సంఘాలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మత్స్యకారులు మాట్లాడుతూ.. దశాబ్దాలుగా సముద్ర తీర ప్రాంతాల్లో చేపలవేటపై ఆధారపడి జీవిస్తున్న తమ హక్కులకు భంగం కల్గించకుండా ఈ ప్లాన్‌ను అమలు చేయాలని కోరారు. సి ఆర్ జెడ్ ఖరారులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ ప్రజాబిప్రాయ సదస్సులను తీర ప్రాంత గ్రామాల్లో నిర్వహిస్తే ఎక్కువ మంది మత్స్యకారులు హాజరయ్యే అవకాశం ఉందని సూచించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను మత్స్యకారులు అధికారులకు వివరించారు. కడలూరుకు చెందిన తమిళ జాలర్ల వల్ల తాము ఇబ్బందులు పడుతున్నామని, తమ మత్స్య సంపదను వారు దోచుకెళ్తూ తమపై దాడులు చేస్తున్నారని, తమకు రక్షణ కల్పించాలని కోరారు. బకింగ్‌హామ్ కెనాల్ పూడికతీత పనులు చేపట్టాలన్నారు. ఎస్‌టిలకు గుర్తింపు కార్డులు అందజేసి మత్స్యశాఖ ద్వారా సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. సముద్రతీరంలో ఉన్న మడ అడవులను కాపాడాలని, ఎటువంటి హాని కల్గించకుండా చూడాలన్నారు. మైపాడు బీచ్‌ని అభివృద్ధి చేయాలని, అన్ని వసతులు కల్పించాలన్నారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో మత్స్యకారుల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలను చేపడుతున్నామని, బోట్లను ఎస్సీ ఎస్టీలకు 60 శాతం, ఇతరులకు 40శాతం రాయితీతో ఖరీదైన బోట్లను చేపల వేట కోసం అందజేస్తున్నట్లు చెప్పారు. తమిళనాడు జాలర్ల అక్రమ ప్రవేశాలపై జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులతో చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కోస్టల్ జోన్ మేనేజ్‌మెంటు ప్లాన్ ఖరారులో మత్స్యకారులు తెలిపిన అన్ని అభిప్రాయాలను వీడియో రికార్డు చేసి కేంద్ర పర్యావరణ శాఖ కు నివేదిస్తామని ఈఈ రాజ శేఖర్ తెలిపారు. ఈ సమావేశంలో ఎన్విరాన్‌మెంటల్ సీనియర్ ఇంజనీరు శాస్త్రి, పొల్యూషన్ బోర్డు అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# గుంపర్లపాడు హైస్కూల్‌ను పరిశీలించిన డీఈఓ



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండలంలోని గుంపర్లపాడు జడ్పీ హైస్కూల్‌ను మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి పివిజె రామారావు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్యక్రమం పరిశీలించి స్వయంగా రుచి చూసి సంతృప్తి వ్యక్త పరిచారు. అలాగే ఈ నెల 22వ తేది నుండి పాఠశాలలో జరుగుతున్న శిక్షసప్తాహ్ కార్యక్రమంలో రెండవరోజు చేస్తున్న ఎఫ్ఎల్ఎన్ కృత్యాలు పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం పాఠశాల రికార్డులు పరిశీలించి యు డైస్ ప్లస్‌లో ఉన్న రోల్‌కు అటెండన్స్ రిజిస్టర్‌లో ఉన్న రోల్‌కు సరిపోవాలని సూచించారు. అలాగే బడి ఈడు పిల్లలను తిరిగి పాఠశాలలో చేర్పించడం, దీర్ఘకాలికంగా ఆబ్సెంట్స్ లేకుండా చూసుకోవడం తరగతి ఉపాధ్యాయుల బాధ్యత అని పేర్కొన్నారు. చదువులో వెనుకబడిన పిల్లలకు రెమెడియల్ క్లాసులు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులను సమావేశపరిచి సూచనలు, సలహాలు అందజేశారు. పాఠశాల పనితీరుపై సంతృప్తి వ్యక్తపరిచారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోతులూరయ్య, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుధీర్ బాబు, మండల విద్యాశాఖధికారి డి.సాయిప్రసాద్, సిఆర్‌ఎంటిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జగన్మోహన్ రెడ్డి శాడిస్టే కాదు.. తెలివితక్కువ దద్దమ్మ కూడా..

### టీడీపీ రాష్ట ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి ఫైర్ !



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్మోహన్ రెడ్డికి లేదని టీడీపీ రాష్ట ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి విమర్శించారు. నిన్న అసెంబ్లీ గేట్ వద్ద జరిగిన సంఘటన చూస్తే.. జగన్మోహన్ రెడ్డి శాడిస్ట్‌తో పాటు.. తెలివితక్కువ దద్దమ్మ అని అందరికీ అర్థమైందన్నారు. నెల్లూరులోని టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడా రు. ఈ సందర్భంగా తనదైన శైలిలో జగన్ పై, వైసీపీ క్యాడర్ పై విమర్శనాస్త్రాలు సంధించారు.. వైసీపీకి చెందిన ఇద్దరు కార్యకర్తలు చంపుకుంటే రాష్టపతి పాలన పెడతారా. అంటూ ఆయన ప్రశ్నించారు. ఇంకా జగన్ కి పదవి మీద వ్యామోహం పోలేదని.. ఆయన వైఖరి నచ్చక ఆరుగురు ఎమ్మెల్యేలు గోడ దూకేందుకు సిద్దంగా ఉన్నారంటూ ఆయన బాంబ్ పేల్చారు.. పోలీసులను అడ్డం పెట్టుకుని జగన్మోహన్ రెడ్డి ఎన్నో అక్రమాలు చేశారని.. తమ కార్యకర్తలను అనేక ఇబ్బందులు పెట్టారని ఆయన గుర్తు చేశారు. సిటీ నియోజకవర్గంలో పోలీసులు ఎన్ని ఇబ్బందులు పెట్టినా.. కార్యకర్తలను కాపాడుకున్నానని.. చంద్రబాబు, బాలయ్యబాబు ఆశీస్సులతో పోరాటాలు చేశానని కోటంరెడ్డి వెల్లడించారు.. 64 అక్రమ కేసులు పెట్టినా.. ఎక్కడా వెనక్కి తగ్గలేదన్నారు. అసెంబ్లీలో భువనేశ్వరమ్మను తిట్టిన యదవలు, శాసనమండలిలో జిప్ విప్పిన సైకోలు అడ్రస్ లేకుండా పోయారంటూ ధ్వజమెత్తారు. చంద్రబాబునాయుడు తలచుకుంటే ఒక్క వైసీపీ కార్యకర్త కూడా మిగలరని వ్యాఖ్యానించినా.. ఆయన.. తాము వైసీపీ లాగా కక్షసాధింపు చర్యలకు దిగబోమని స్పష్టం చేశారు.. ఆరు నెలలు కూడా పోరాటాలు చెయ్యలేక.. వైసీపీకి చెందిన పలువురు నేతలు తమ ఇళ్ల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు.. ఏపీ రాజకీయాల్లో జగన్ త్వరలో కనుమరుగు అవ్వడం ఖాయమని కోటంరెడ్డి జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మామిడల మధు,కపిర్ శ్రీనివాసులు, కువ్వరపుబాలాజీ, జహీర్,అంచూరి శ్రీనివాసులు నాయుడు, కొకు మహేంద్ర రెడ్డి, పుట్టా అజయ్రెడ్డి, మోయుధిన్, నాగేంద్ర ఇతర ముఖ్యనేతలు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రితో ఎంపీ వేమిరెడ్డి భేటీ



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయని ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో మంగళవారం కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీ.. ఆయనతో భేటీ అయి కార్మికులకు సంబం ధించి వివిధ అంశాలను కేంద్ర మంత్రి దృష్టికి తెచ్చారు. నెల్లూరు జిల్లా పరిధిలో అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమం, వారికి సంబంధించి స్కీమ్స్ వంటి అంశాలను కేంద్రమంత్రితో చర్చించారు. అలాగే జాతీయ ఆహార భద్రతా చట్టం, ఉపాధి హామీ పథకం, దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ యోజన, ప్రధాన్‌మంత్రి ఆవాస్ యోజన, గరీబ్ కల్యాణ్ రోజ్‌గార్ అభియాన్, పీఎం స్వానిధి వంటి పథకాలపై కేంద్ర మంత్రితో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చర్చించారు.

## రాష్ట మత్స్య శాఖ కమిషనర్ కలిసిన వేణుగోపాల్



**కావలి, మేజర్‌న్యూస్ :** మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన డోల శంకర్‌ను రాష్ట్ర మత్స్య శాఖ కమిషనర్‌గా నియమించినందున మత్స్యకార నాయకుడు వేణుగోపాల్ అభినందనలు తెలిపారు. అనంతరం మంగళవారం విజయవాడలోనే కమిషనర్ ఛాంబర్ కార్యాలయంలో మత్స్యకార నాయకుడు వేణుగోపాల్ మత్స్యకార కమిషనర్ డోలాశంకరనీ కలిసి పుష్పగుత్యాన్ని అందించి అభినందనలు తెలిపారు. అనంతరం వేణుగోపాల్ మాట్లాడుతూ.. ఐఓఎఫ్ఎస్ అధికారి మస్యశాఖ సంచాలకులుగా నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన డోలా శంకరును నియమించడం అభినందనీయమని మత్స్యకారుల అవసరాలను వారి పరిస్థితులను పూర్తిగా అవగాహన కలిగిన వ్యక్తికి ఈ పదవి వలన మత్స్యకారులకు న్యాయం జరుగుతుందని తెలిపారు.

## రాష్ట్రాభివృద్ధికి భారీగా నిధులు కేటాయించిన కేంద్రం



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** రాయలసీమ ప్రకాశం ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజి అభివృద్ధికి దోహదం పడుతుందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి అన్నారు. కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రెవేశ పెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పేద ప్రజల కోసం దేశంలో కొత్తగా మూడు కోట్లు పక్కా ఇళ్ళు మంజూరు చేసిందని, ఇళ్ళు లేని పేదలు ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన పథకం కింద ఇళ్ళు నిర్మాణం చేపట్టానున్నట్లు తెలిపారు. అర్బన్ హౌసింగ్ కోసం 2.2 లక్షల కోట్లు రూపాయలు కేటాయించడం శుభ పరిణామం అన్నారు. ఇక రాష్ట్రాన్ని కీ జీవ నాడి లాంటి పోలవరంప్రాజక్ట్ కు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయడం తో నిర్మాణపనులు వేగం అవుతాయని ఆశాభావం వ్యక్తం చెశారు..15 000కోట్లు రూపాయలు మంజూరు రాయలసీమ జిల్లా ప్రకాశం ఉత్తరాంధ్ర జిల్లా ల కు ప్రత్యేక ప్యాకేజి ఇవ్వడం ఇవ్వడం సంతోషదాయకం అన్నారు.

# ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు

నెల్లూరు, మేజర్‌న్యూస్ : జిల్లాలో ఇసుక సక్రమ పంపిణీ.. అక్రమ రవాణాను నిరోధించేందుకు జిల్లా, డివిజన్, మండల స్థాయిలో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేయవలసిందిగా జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ చాంబర్లో మూడవ జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. నూతన ఇసుక విధానం గురించి మైనింగ్ ఉపసంచాలకులు శ్రీనివాస కుమార్ కమిటీ సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గుర్తించిన ఇసుక యార్డ్ /స్టాక్ పాయింట్లలోఎక్కడా ఎటువంటి ఆరోపణలకు ఆస్కారం లేకుండా కేవలం రవాణా ఖర్చులు భరిస్తూ ఉచితంగా ఇసుక ను ప్రజలకు అందించాలన్నారు. ఇసుక పంపిణీ కు అదనపు పంపిణీ ప్రాంతాలను గుర్తించాలన్నారు. ఇప్పటికే పల్లిపాడు స్టాక్ పాయింట్ లో ఇసుక పంపిణీ పూర్తయిందని, మర్రిపాడు, మినగల్లు స్టాక్ పాయింట్లలో వరుసగా 1,03,561 మెట్రిక్ టన్నులు, 17,743 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉన్నదన్నారు. అదేవిధంగా స్టాక్ పాయింట్ల లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇసుక పంపిణీ, నిల్వల గురించి ఎప్పటికప్పుడు నివేదించేందుకు అవసరమైన అదనపు సిబ్బంది ని నియమించుకోవాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సేథు మాధవన్, ఇరిగేషన్ ఎస్ ఇ కృష్ణ మోహన్, ఆర్ డి ఓ లు మాలోల, మధులత తదితరులు పాల్గొన్నారు.





కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేసిన మంత్రి నారాయణ

# కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి వరాల జల్లు

నెల్లూరు క్రైం, మేజర్ న్యూస్ : కేంద్ర బడ్జెట్‌లో.. రాజధానికి అమరావతికి భారీ ఆర్థిక సాయం ప్రకటించడం సంతోషకరమని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. మంగళవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాధాన్యం ఇవ్వడంపై మంత్రి నారాయణ హర్షం వ్యక్తం చేశారు. అమరావతి అభివృద్ధికి రూ. 15వేల కోట్లు కేటాయించినట్లు ప్రకటించడం అభినందనీయమన్నారు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం అమలుకు చర్యలు తీసుకోవడంపై శుభపరిణామన్నారు. అలాగే ఏపీలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించడం గొప్ప విషయమన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, ప్రకాశం ప్రాంతాలకు నిధులు కేటాయించు ద్వారా ఆయా ప్రాంతాలు ఎంతో అభివృద్ధి చెందుతాయన్నారు. సాధ్యమైనంత త్వరగా పోలవరం ప్రాజెక్టు పూర్తిచేయాలని నిర్ణయం హర్షణీయమన్నారు. విశాఖ- చెన్నై, బెంగళూరు-ఓర్వకల్లు పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి ప్రోత్సాహం ఇచ్చింద న్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలు రాష్ట్రానికి భారీ స్థాయిలో నిధులు రాబట్టేలా చేశాయని పేర్కొన్నారు. సమర్థవంతమైన నాయకత్వం ఎలా ఉంటుందో సీఎం చేసి చూపారన్నారు.

# కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి ప్రాధాన్యం ఇవ్వడంపై ఎంపీ వేమిరెడ్డి హర్షం

నెల్లూరు, మేజర్‌న్యూస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని అన్ని ప్రాంతాలు, అన్ని రంగాల అభివృద్ధికి సీఎం నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తు న్నారని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాధాన్యం ఇవ్వడంపై ఎంపీ వేమిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి భారీగా నిధులు రాబట్టిన కూటమి ప్రభుత్వానికి ఆయన అభినందనలు తెలియజేశారు. సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటనలు రాష్ట్రానికి భారీ స్థాయిలో నిధులు రాబట్టేలా చేశాయని వ్యాఖ్యానించారు. సమర్థవంతమైన నాయకత్వం ఎలా ఉంటుందో సీఎం చంద్రబాబు చేసి చూపారన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనల ఫలితంగా రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యం దక్కిందని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బడ్జెట్‌లో



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్ల ఆర్థిక సాయం ప్రకటించడం గొప్ప విషయమని, అలాగే భవిష్యత్తులోనూ రాజధాని నిర్మాణానికి సహాయం అందుతుందని కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటించడంపై ఆయన ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర జీవనాడి పోలవరం పూర్తికి అధిక నిధులు కేటాయింపుపై ఎంపీ సంతోషం వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో వెనుకబడిన రాయలసీమ ప్రాంతం, ప్రకాశం జిల్లా, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వడం ద్వారా ఆయా ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నారు. అలాగే పారిశ్రామికంగా రాష్ట్రాన్ని బలోపేతం చేసేలా హైదరాబాద్-బెంగళూరు పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి, విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్ లోని నోడ్‌లకు ప్రత్యేక సాయం ప్రకటించడం శుభపరిణామన్నారు. కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక కేంద్రాల అభివృద్ధి ద్వారా కంపెనీలు ఏర్పడి వేలాదిమంది యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు దక్కుతాయన్నారు. పూర్వోదయ పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక ప్రాజెక్ట్, ఏపీ విభజన చట్టం అమలుకు పూర్తి స్థాయిలో కట్టుబడి ఉన్నామని బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడంపై ఎంపీ వేమిరెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు.

## గడ్డివాము దగ్ధం

విడవలూరు, మేజర్‌న్యూస్ : విద్యుత్తు ట్రాన్స్ఫార్మర్ పేలటంతో చెలరేగిన మంటల కారణంగా సమీపాన ఉన్న గడ్డివామి దగ్ధమైన సంఘటన మండల కేంద్రమైన విడవలూరులో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు విడవలూరు లోని అంకమ్మ దేవస్థానం సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ పేలటంతో మంటలు చెలరేగాయని తెలిపారు దీంతో సమీపాన ఉన్న పిచ్చయ్య కు చెందిన దగ్ధమైందని దాదాపు ఇది నాలుగు ఎకరాల గడ్డి ఉంటుందని తెలిపారు మంటలు అదుపులోకి రాకపోవడంతో అగ్నిమాపక శాఖ సిబ్బంది వారికి సమాచారం అందించారు దీంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు.



## పీఎం విశ్వకర్మ పథకం లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయండి



నెల్లూరు, మేజర్‌న్యూస్ : ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం కింద లబ్ధిదారుల ఎంపికకు సచివాలయ సిబ్బంది ద్వారా పరిశీలన ప్రక్రియ పూర్తి చేయవలసినదిగా కలెక్టర్ ఓ.ఆనంద్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం జిల్లా అమలు కమిటీ సమావేశం నిర్వహించారు. డీఐసి జనరల్ మేనేజర్ సుధాకర్ ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం ఉద్దేశాలను వివరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ రకాల వృత్తి కళాకారులకు సంబంధించి జిల్లాలో ఇప్పటివరకు 68,546 దరఖాస్తులు వచ్చాయని, వీటిని మూడు దశల్లో పరిశీలన చేయవలసి ఉందన్నారు. ఇందుకోసం ప్రత్యేక చెక్ లిస్ట్ తయారు చేసుకుని, అందుకనుగుణంగా పరిశీలన చేయాలన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం నిబంధనల మేరకు వృత్తి నే నమ్ముకున్న కళాకారులు వారి వారి వృత్తి నైపుణ్యాన్ని పెంచుకుని వారి కుటుంబాలను పోషించుకునే విధంగా తయారు కావాలన్నారు. గురుశిష్య పరంపర ను కొనసాగించే విధంగా వృత్తి నైపుణ్యాలను ప్రభుత్వం అందిస్తున్న సహాయంతో తర్వాతి తరాలకు అందించాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఏ పిడి సాంబశివ రెడ్డి, మున్సిపల్ అడిషనల్ కమీషనర్ శర్మద, ఎల్‌డియం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ గుంత సర్వే



విడవలూరు, మేజర్ న్యూస్ : మండలంలోని వరిని పంచాయతీలో ఉన్న గుంతను అసిస్టెంట్ సర్వేరు సురేంద్ర మంగళవారం సర్వే చేపట్టారు ఈ సందర్భంగా సర్పంచ్ రావెళ్ల మల్లికార్జునరావు మాట్లాడుతూ తమ పంచాయతీ పరిధిలోని పాపిరెడ్డి గుంటను కొందరు ఆక్రమించుకొని తమ పొలాల్లో కలుపుకుంటున్నారని తెలిపారు దీంతో పంచాయతీ గుంత కుంచించుకుపోతోందని ఈ కారణంగా పశువులు తాగునీటికి అవస్థలు పడుతున్నాయని ఆవేదన చెందారు. దీని పై ఇటీవల తహసిల్దార్ శ్రీనివాస్ కు ఫిర్యాదు చేయగా వారు సర్వే చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అవార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కౌలు రైతులకు గుర్తింపు కార్డులు తప్పనిసరి



విడవలూరు మేజర్‌న్యూస్ : మండలంలోని కౌలు రైతులకు తప్పనిసరిగా గుర్తింపు కార్డులు ఉండాలని మండల వ్యవసాయ అధికారి వెంకట కృష్ణయ్య తెలిపారు. మండలంలోని దంపూరులో మంగళవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఉండటం వల్ల ప్రభుత్వ పథకాలతో పాటు సబ్సిడీపై వచ్చే వరి వంగడాలు ఎరువులు విత్తనాలు లభిస్తాయని తెలిపారు. ఈ కారణంగా ప్రతి కౌలు రైతు గుర్తింపు కార్డులను పొందాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, సర్పంచ్ సురేందర్ రెడ్డి, ఎంపీటీసీ భాను, టిడిపి నాయకులు రాంప్రసాద్, శ్రీధర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# నిర్ణీత గడువులోగా రుణాలు చెల్లిస్తే వడ్డీ రాయితీ

## - ఏపీజీబీ మేనేజర్ జనార్దన్ రావు

**మర్రిపాడు మేజర్ న్యూస్:** నిర్ణీత గడువులో రుణాలు చెల్లిస్తే వడ్డీ రాయితీ లభిస్తుందని మర్రిపాడు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ చింతమనేని జనార్దన్ రావు అన్నారు. ఆయన మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి ప్రసంగించారు. రుణాలు తీసుకున్న ప్రతి ఒక్కరూ సకాలంలో చెల్లిస్తే వడ్డీ రాయితీ లభిస్తుందనే విషయం అవగాహన లేకపోవడమే ముఖ్య కారణం అన్నారు. అందువలన ప్రతి గ్రామంలో సమావేశాలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. ప్రస్తుతం రుణాలు తీసుకున్న వారి సంఖ్య ఎక్కువగా ఉందని, ఆ రుణాలు తిరిగి కట్టన వారి సంఖ్య తక్కువగా ఉందన్నారు. రుణాలు తీసుకునేవారు సకాలంలో చెల్లిస్తే కార్డుకు ట్రాక్టర్లు కూడా రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. ప్రధానంగా బ్యాంకులో అప్పులు కోసం వచ్చే వారే తప్ప సేవింగ్స్ చేసే వారి సంఖ్య అతి తక్కువగా ఉందన్నారు. బ్యాంకు మీద నమ్మకంతో ఖాతాదారుల విషయంలో అవసరాలు తీర్చడంలో ముందు ఉండడం వల్ల 100 కోట్ల టర్నోవర్ జరుగుతుందన్నారు.



ఖాతాదారులకు రైతులకు బ్యాంకు సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయన్నారు. సిబ్బంది కొరత కూడా లేదన్నారు. బ్యాంకును అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఎవరైనా సమస్యలు ఎదుర్కొంటే తప్పక తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ మధు, ఫీల్డ్ ఆఫీసర్ సత్యనారాయణ, నవీన్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



## వ్యక్తిగత మరుగుదొడ్లు తప్పనిసరి

### - ఎంపీడీవో తాజ్ మస్తూర్

అనంతసాగరం (మేజర్ న్యూస్) స్వచ్ఛభారత్ లో భాగంగా ప్రతి ఒక్క కుటుంబం తప్పనిసరిగా మరుగుదొడ్లు ఏర్పాటు చేసుకోవాలని ఎంపీడీవో తాజ్ మస్తూరు అన్నారు. అనంతసాగరం మండలంలోని సోమశిల, పడమటి ఖమ్మంపాడు తదితర గ్రామాల్లో మంగళవారం గ్రామసభలు జరిగాయి. మరుగుదొడ్ల నిర్మాణం, వినియోగం తప్పనిసరి అని ఎంపీడీవో సూచించారు. జల జీవన్ లో భాగంగా ప్రతి కుటుంబానికి మంచినీటి కొళాయి ఉండేలా చూడాలని ఆయన కార్యదర్శులను ఆదేశించారు. పంచాయితీల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు.గ్రామానికి చెందిన పలువురు తమకు మరుగుదొడ్లు లేవని గ్రామసభలో తెలిపారు. అవసరమైన వారు పంచాయతీలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పంచాయితీ సెక్రెటరీ నరేంద్రబాబు, ఆర్డబ్ల్యూఎస్ జేఈ సుదర్శన్, మహిళా పోలీస్ దగ్గోలు ఫెర్సీ గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాలకు సీఎం చిత్రపటాలు



మర్రిపాడు మేజర్ న్యూస్: రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సూచనతో మర్రిపాడు మండల కేంద్రం లోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మండల టిడిపి అధ్యక్షులు అరికట్ల జనార్దన్ నాయుడు సీనియర్ నాయకులు శాఖమూరి నారాయణ ఆదేశాల మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలను తెలుగుదేశం పార్టీ నాయకులు చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ హయాంలో రాష్ట్రం ఎంతగానో అభివృద్ధి చెందిందని, రాబోయే రోజుల్లో కూడా మరింత అభివృద్ధి చెందింది ఎందుకు పార్టీ ముందుకు పోతుందని తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు లక్ష్మీనరసయ్య యాదవ్ ఎర్ర గంగినేని వెంకటేశ్వర్లు యువ నాయకులు మాదుపూరు చంద్రబాబు ఎలాగాల వెంకటేశ్వర్లు పి పోలయ్య టిడిపి సీనియర్ నాయకులు కే వెంకటేశ్వర్లు మర్రిపాడు టిడిపి గ్రామ అధ్యక్షులు శాఖాపురం సురేష్ మండల నూర్ భాషా సంఘం అధ్యక్షులు ఎస్కే మహబూబ్ బాషా మైనార్టీ నాయకులు సయ్యద్ గౌస్ బాషా అంజి కే వినయ్ తెలుగుదేశం పార్టీ మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వేరుశనగ పంట నాశనం..

### ప్రభుత్వం ఆదుకోవాలని రైతు వేడుకోలు

దగదర్తి మేజర్ న్యూస్: దగదర్తి మండలం ఉలవపాళ్ల గ్రామానికి చెందిన కొవూరు రవీంద్రబాబు అనే రైతు తన పొలంలో ఎకరా 20 సెంట్ల భూమిలో వేరుశనగ పంట పండిస్తున్నాడు. మంగళవారం ఉదయం పొలానికి వెళ్లిన స్థానిక రైతులు వేరుశనగ పంట ఎండిపోయి ఉండటానికి గమనించి రవీంద్ర బాబుకు సమాచారం అందించారు. ఎవరో పంటను నాశనం చేసేందుకు గడ్డి ముందు చల్లినట్లు గుర్తించారు.చేతికి అందివచ్చిన పంటను గుర్తుతెలియని వ్యక్తులు నాశనం చేశారని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. గత సోమవారం అర్ధరాత్రి ఇదే వ్యక్తికి చెందిన వ్యాపార దుకాణం కూడా అగ్నికి ఆహుతైంది. పోలీసు ఉన్నతాధికారులు ఈ ఘటనలపై దర్యాప్తు చేపట్టి నిజ నిజాలను తేల్చాలని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.



## డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ తరగతులు

### - జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి వై వెంకటయ్య



నెల్లూరు మేజర్ న్యూస్ (విద్య) : జిల్లా బీసీ సంక్షేమ సంఘం తరపున ఉపాధ్యాయ డీఎస్సీ పరీక్షలకు పోటీ పడుతున్న అభ్యర్థుల కు త్వరలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి వై వెంకటయ్య ఒక ప్రకటనలోతెలిపారు సబ్జెక్టుల వారీగా అధ్యాపకులు నియమించి నెల్లూరు నగరం లోని వీఆర్సీ లో శిక్షణ తరగతులు నిర్వహిస్తు న్నట్లు ఈ అవకాశాన్ని జిల్లాలోని డీఎస్సీ నిరుద్యోగ అభ్యర్థులు సద్వినియోగపరుచుకోవాలని జిల్లాఅధికారి వెంకటయ్య కోరారు.

## పాత పన్ను విధానంలో మార్పులు చేయాలి..

### ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి సురేందర్ రెడ్డి



నెల్లూరు మేజర్ న్యూస్ (విద్య): నూతన బడ్జెట్లో పాత ఆదాయం పనులు స్లాబులు మార్చకపోవడం సామాన్య వేతన జీవులకు తీవ్ర నిరాశ కలిగించేటువంటి అంశం అని జిల్లా ఏపీటీఎఫ్ అధ్యక్షుడు అల్లంపాటి సురేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు నూతన పన్ను విధానంలో ఏడు లక్షలు ఆదాయం వరకు ఉన్న వారికి ఇచ్చే రిబేటును పాత పన్ను విధానంలో ఉండే వారికి కూడా వర్తించే విధంగా చేసి ఉండాల్సిందని సేవింగ్ పరిమితిని కనీసం25 లక్షలకు పెంచి ఉంటే పొదుపు చేసుకోవ దానికి ప్రోత్సాహం ఉండే విధంగా ఎనిమిది లక్షల వరకు పన్ను మినహించాల్సిందని ఉద్యోగులందరూ కోరుకునే విధంగా ఆర్థిక భద్రత కలిగించడానికి సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టి ఉండాల్సిందని సురేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు

## జిల్లా అధికారులకు పవిత్ర గ్రంథం అందజేత

నెల్లూరు ( మేజర్ న్యూస్) : నెల్లూరు బారా షహీద్ దర్గా పవిత్ర గంధాన్ని నెల్లూరు జిల్లా కలెక్టర్ ఆనంద్, జిల్లా ఎస్పీ మురళీకృష్ణ జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ తదితరులకు మంగళవారం అందజేశారు. రొట్టెల పండుగ నిర్వహణకు తమకు పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందించారని కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బారాషహీద్ దర్గా చైర్మన్ ఖాదర్ బాషా, కార్యదర్శి షేక్ మునీర్ బాషా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## మహిళల గురుకుల పాఠశాల కోసం స్థల పరిశీలన



అనంతసాగరం (మేజర్ న్యూస్): అనంతసాగరం మండలం సోమశిల లో మహిళా గురుకుల పాఠశాల నిర్మాణానికి మంగళవారం రెవెన్యూ అధికారులు స్థల పరిశీలన చేపట్టారు. పాత గురుకుల పాఠశాల స్థలాన్ని ఆత్మకూరు ఆర్డీవో మధులత, డి.డి వెంకటయ్య లు పరిశీలించారు. పాఠశాల నిర్మాణానికి సరిపడా స్థలం అనువైన పరిస్థితులు లేకపోవడంతో మరో ప్రభుత్వ స్థలాన్ని అధికారులు అన్వేషించనున్నారు. బుధవారం ఆర్డీఓ మరల సోమశిల కు విచ్చేయనున్నారు. ఉత్తర కాలువ సమీపానగల పాలిటెక్నిక్ కళాశాల వద్ద ప్రభుత్వ స్థలాన్ని నేడు పరిశీలించనున్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో ఉదయగిరి ప్రభాకర్, గిరిజన గురుకుల పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణా వాహనాల పట్టివేత



అనంతసాగరం (మేజర్ న్యూస్) అనంతసాగరం మండలం బెడుసు పల్లి గ్రామ పెన్నా తీరం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు మంగళవారం తెల్లవారుజామున అదుపులో తీసుకున్నారు. వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. కోర్టుకు హాజరు పర్చనున్నారు.

## నెల్లూరు నగరపాలక సంస్థ నూతన కమిషనర్‌గా మల్లవరపు సూర్యతేజ



నెల్లూరు కార్పొరేషన్ (మేజర్ న్యూస్): నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ బదిలీపై (కె ఎ డి ఎ) వెళ్లగా, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారు లు నూతన కమిషనర్ గా మల్లవ రపు సూర్య తేజ ఐఏఎస్., ను కమిషనర్ గా నియమిస్తూ ఉత్తర్వు లు జారీ ఈ మేరకు బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించనున్నారు మల్లవరపు సూర్య తేజ

# పాపాల పెద్దిరెడ్డి పాపం పండే రోజు త్వరలోనే ఉంది

## నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి పఠాన్ సాబీర్ ఖాన్



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నెల్లూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి పఠాన్ సాబీర్ ఖాన్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఈరోజు ఒక సురక్షితమైన చేతుల్లో ఉందని చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పురోగతి దిశగా అడుగులు వేస్తుందని సాబీర్ ఖాన్ తెలిపారు. మదనపల్లిలో సబ్ డివిజన్ రిజిస్టర్ కార్యాలయ దగ్ధం జరిగిన ఘటన సిగ్గు చేటు అని తెలిపారు. సైకో జగన్ రెడ్డి, పాపాల పెద్దిరెడ్డి గత 5 సంవత్సరాలు చేసిన పాపాలు కప్పిపుచ్చుకునేందుకు ఈరోజు ప్రభుత్వ కార్యాలయాలు కూడా దగ్ధం చేసే దౌర్భాగ్య పరిస్థితికి దిగజారారు. తాంబళపల్లి, మదనపల్లి, పుంగనూరు, పీలేరుకి సంబంధించిన పేద ప్రజల భూముల పట్టాలు, వైకాపా నాయకులు దోచుకున్న అక్రమ అసైన్డ్ భూముల కాగితాలు, వైకాపా అక్రమ మైనింగ్ ఫైళ్లు అన్ని వీళ్ళ బాగోతలు బయటపడతాయి అని కాల్చేసే పరిస్థితికి వచ్చారు. జగన్ రెడ్డి గత 5 సంవత్సరాలు తప్పు చేయడం డైవర్షన్ పాలిటిక్స్‌తో దానిని కప్పిపుచ్చడం చేసాడు ఇప్పుడు ప్రజలు 11 సీట్లకు పరిమితమైన అదే ధోరణితో రాజకీయాలు చేయడం సిగ్గు చేటు.. సాధారణంగా నూతన ప్రభుత్వం ఏర్పడితే నైతికంగా 3 నుండి 6 నెలల కాలం వారికి ఇచ్చి తరువాత తప్పు ఒప్పుల మీద ప్రతిపక్షాలు కానీ ప్రజా సంఘాలు కానీ ప్రశ్నిస్తాయి కానీ నైతిక విలువల అర్థం కూడా తెలియని జగన్ రెడ్డి ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చి 50 రోజులు కూడా కాకా ముందే నిఘాతినిచ్చంగా వ్యవహరిస్తున్నారు కర్మ సిద్ధాంతం అనేది ఒకటుంటుంది జగన్ రెడ్డి. వంద ఆవులను దూడలను తాళ్లతో కట్టేసినా మళ్ళీ వదిలితే వేటి దూడ దెగ్గరరికి అవే వెళ్తాయి అదేవిధంగా జగన్ రెడ్డి గత 5 ఏళ్ళు చేసిన పాపాలు కూడా ఎన్ని కుట్రలతో కప్పిపుచ్చిన 1 కి 10 గా వెనక్కి వచ్చి జగన్ రెడ్డి మరియు పాపాల పెద్ది రెడ్డి పాపం పండే రోజు త్వరలోనే ఉంది. ప్రజాస్వామ్యాన్ని తన 5 ఏళ్ల దుర్భరమైన పాలనలో ప్రజాస్వామ్య వ్యవస్థను పరిహాస్యం చేసిన దుర్మార్గుడు జగన్ రెడ్డి ఈరోజు అసెంబ్లీ బయట ప్రజాస్వామ్యం గురించి నీతులు చెప్పడం హాస్యాస్పదం అని సాబీర్ ఖాన్ తెలిపారు. సమావేశంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్సి సెల్ అధికార ప్రతినిధి మతంగి కృష్ణ, తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యదర్శి కనపార్తి గంగాధర్, 36వ డివిజన్ ఇంచార్జ్ ఎంఏ రసూల్, బీసీ సెల్ పార్లమెంట్ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ షేక్ షరీఫ్, బీసీ సెల్ రూరల్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు దేవరకొండ ప్రసాద్, వాణిజ్య విభాగం కార్యదర్శి ఎంసి సుబ్రమణ్యం, మొగల్ అస్లాం, షేక్ ముజీబ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# యాప్స్ ద్వారా బిల్లుల చెల్లింపులపై అవగాహన




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** జిల్లా పర్యవేక్షక ఇంజనీర్ వి.విజయన్ మంగళవారం నెల్లూరు నగరంలోని టౌన్ 1,2 విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలలో వినియోగదారులకు విద్యుత్ బిల్లులను యాప్స్ ద్వారా ఎలా చెల్లించాలో వినియోగదారులకు అవగాహన కల్పించుటకు ప్రత్యేక కౌంటర్లను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశామని, వినియోగదారులకు ఏ సందేహం ఉన్న రెవెన్యూ కార్యాలయాల్లోని హెల్ప్ డెస్క్‌లను సంప్రదించవచ్చని తెలిపారు. విద్యుత్ బిల్లు చెల్లించడం చాలా సులభతరమని ఆండ్రాయిడ్ ఫోన్ ద్వారా విద్యుత్ బిల్లులను ఇంటి దగ్గర నుండే మనం చెల్లించవచ్చని క్యూలో నిలబడి బిల్లులు కట్టే అవసరం ఉండదని తెలిపారు. యూపీఐ యాప్స్ ద్వారా విద్యుత్ బిల్లును చెల్లించవచ్చని తెలిపారు. విద్యుత్ శాఖ వెబ్‌సైట్‌లో గూగుల్ క్రోమ్‌లోకి వెళ్లి ఏపీఎస్పీడీసీఎల్ బిల్ పేమెంట్ అని టైప్ చేయగా, బిల్ డెస్క్ ఆప్షన్ వస్తుంది, బిల్ డెస్క్‌పై మనం క్లిక్ చేసి 13 అంకెల సర్వీస్ నెంబరును ఎంటర్ చేసి దాని కింద భాగాన క్యాప్చ ఎంటర్ చేసి సబ్మిట్ చేయాలి. వెంటనే మన సర్వీస్ నెంబర్‌కు సంబంధించిన పూర్తి వివరాలు డిస్ప్లే లో కనిపించును, మనం ఒకసారి వివరాలు చూసుకొని సబ్మిట్ చేయగా, వెంటనే మనం ఎంత బిల్ కట్టాలో తెలుస్తుందన్నారు. ఆ అమౌంట్ ను మనం క్రెడిట్ కార్డ్, డెబిట్ కార్డ్, నెట్ బ్యాంకింగ్, యూపీఐ, ద వాలెట్, గూగుల్ పే, ఫోన్ పే, రూపే కార్డ్స్ ద్వారా మనం చాలా సులభంగా చెల్లించవచ్చును. ప్లే స్టోర్లో ఏపీ ఎస్పీడీసీఎల్ యాప్ డౌన్లోడ్ చేసుకుని తర్వాత 13 అంకెల సర్వీస్ నెంబర్ నమోదు చేసుకోవడం ద్వారా మొబైల్ యాప్స్ ద్వారా వివిధ రకాల సేవలను పొందవచ్చును. దీనిలో బిల్ పే ఆప్షన్ ద్వారా విద్యుత్ బిల్లులకు ఎలాంటి అదనపు రుసుము లేకుండా సులభంగా కట్టవచ్చును మరియు వినియోగదారులు సర్వీస్ కు సంబంధించిన విద్యుత్ వినియోగం బిల్లు వివరాలు, బిల్లు చెల్లింపు, విద్యుత్ సరఫరా పరిస్థితి వివరములు తెలుసుకొనేలా సరికొత్త సేవలు ఈ యాప్ ద్వారా దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ అందుబాటులోకి తీసుకురావడం జరిగింది. ఈ యాప్ లో పేమెంట్ హిస్టరీలో ప్రతినెలా చెల్లించిన బిల్లులు వివరములు కూడా మనం చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టౌన్ ఏ.సోమశేఖర్ రెడ్డి, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ పి.మురళీ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మధుసూదన్ రెడ్డి, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్స్ నాగమణి, శ్రీలత జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్స్ శ్రీధర్ రాజు, సుబ్బయ్య, గోపాలకృష్ణ మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న కావలి ఎంపీడీవో

**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి రూరల్ మండలం కొత్తపల్లి, రాజువారి చింతలపాలెంలో మంగళవారం కావలి ఎంపీడీవోఎస్ శ్రీధర్ బాబు, సిబ్బంది ఆ గ్రామ పంచాయతీలో సచివాలయ పరిధిలో పరిశీలించి, అక్కడ పరిసర ప్రాంతాలను శుభ్రపరిచి వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించే అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ, గ్రామ ప్రజలు వ్యాధులు రాకుండా కాచి చల్లార్చిన నీరు తాగి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. పారిశుద్ధ్యం లోపించకుండా ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. అలాగే కుష్టు వ్యాధిపై కూడా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి కుమారి పి పరమేశ్వరి పాల్గొన్నారు.



## రేబాల కాలపై ర్యాంపు నిర్మించాలి



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** రేబాల కాలువపై న్యూడా నిధులతో నిర్మించిన స్లాబును చెన్నూరు రోడ్డుకి కలుపుతూ ర్యాంప్ నిర్మించాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రజలు కమిషనర్ను కలిసి వినతిపత్రం మంగళవారం అందజేశారు. కాలువ పై నిర్మించిన కాంక్రీటు వాల్స్ స్లాబ్ పై అక్కడక్కడ మాన్యువల్స్ ఏర్పాటు చేసి ఉన్నాయని వాటిపైన కాంట్రాక్టర్ మూతలు వేయకపోవడంతో అందులో పిల్లలు పడే ప్రమాదం ఉందని సిపిఎం పార్టీ నాయకులు కమిషన్ దృష్టికి తీసుకుని వెళ్లారు. ఆయన వెంటనే మాన్యుహోల్స్‌పై రెండు రోజులో బండలేస్తానని తెలిపారు. రాంపు కూడా వేసేందుకు ప్రయత్నం చేస్తానని ఆయన తెలిపారు. రోడ్డు నుండి రామకృష్ణనగర్ వరకు నిర్మించి ఉన్నారు. ఈ రోడ్డు వలన సుమారు 500 కుటుంబాల వారికి అనుకూలంగా ఉంటుందని వారు తెలిపారు. అదేవిధంగా చెన్నూర్ రోడ్డుపై కాలువకి రక్షణ గోడలు కూడా ఏర్పాటు చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు చల్ల కొలుసు లుసు మల్లికార్జున, షేక్ జానీ బాషా, పడవల సుబ్రమణ్యం, యువజన సంఘం నాయకులు కొమ్మి శ్రీనివాసులు, సిఐటియు నాయకులు మాల్యాద్రి, కామయ్య, సునీలు పాల్గొన్నారు.

## రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయి



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని మారుతీ నగర్ ఉన్న శ్రీవీర అభ యాంజనేయ స్వామిని సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు మంగళవారం విశేష పూజలు నిర్వ హించారు. శాలివాహన (కుమ్మరి) సంఘం వారు ఉభయకర్తలుగా వ్యవ హరించి ఉదయం దేవస్థానంలో అభిషేకాలు, ఆకుపూజ, అష్టోత్తర పూజ లను జరిపించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి భక్తులకు భోజనం వడ్డించారు. అనం తరం ఆయన మాట్లాడుతూ.. ఇదేళ్లు రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, సర్వే పల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో సర్వేపల్లి నియోజ కవర్గం అభివృద్ధి చెందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## సీహెచ్‌లోని రోగులకు ఉచిత భోజనం



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులకు ప్రభుత్వం సోమవారం నుంచి జనరల్ డైట్ ను (ఉచిత భోజనం) అందిస్తుందని సిహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ యు. ప్రసాద్ తెలిపారు. వివిధ గ్రామాల నుంచి చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో అడ్మిట్ అయి చికిత్స పొందే రోగుల సౌకర్యాన్ని దృష్టి లో వుంచుకొని ప్రభుత్వం మధ్యాహ్నం మరియు రాత్రి ఉచిత భోజనాన్ని, మంచి కూరలతో అందజేస్తున్నామన్నారు. అలాగే డెలివరీ అయిన మహిళలకు ఈ జనరల్ డైట్ కింద భోజనము అందజేస్తున్నట్లు వారు తెలిపారు. గతంలో లాగా బయట హోటల్స్ మీద ఆధారపడకుండా, రోగులకు ప్రభుత్వమే నేరుగా ఆసుపత్రిలోనిరో ఈ జనరల్ డైట్ ను అందించడంతో చాలామంది నిరుపేద కుటుంబాలకు చెందిన పేషెంట్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు.

# రాపూరు ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ

## రోగులకు అందుతున్న వైద్య సేవల పై ఆరా.. ఆసుపత్రిలో రికార్డులు తనిఖీ





నెల్లూరు వైద్యం, మేజర్‌న్యూస్ : ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ రమేష్ నాథ్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం రాపూరు ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఆస్పత్రి లో వైద్య చికిత్స కోసం వచ్చిన రోగులను అక్కడ అందుతున్న వైద్యం గురించి, వైద్యుల తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఓపి విభాగానికి వెళ్లి ఓపి చీటీలు పొందే దగ్గర ఏవైనా సాంకేతిక ఇబ్బందులు ఉన్నాయా? అని ఆరా తీశారు. ఆసుపత్రిలో రోగులు, రోగి సహాయకులతో మాట్లాడారు. అనంతరం ఆయన వైద్యులతో సమావేశం నిర్వహించారు. ప్రయివేట్ ఆస్పత్రుల కన్నా మెరుగ్గా వైద్యం అందించాలని ఆయన తెలిపారు. ఆసుపత్రిలో ఉన్న సమస్యలు వైద్యుల కొరత గురించి డాక్టర్ నర్మదాదేవి ఆయన తెలిపారు. సానుకూలంగా స్పందించిన ఆయన ఆసుపత్రిలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాపూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

# జెడ్పీ బాలుర హైస్కూల్‌లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు

పొదలకూరు, మేజర్‌న్యూస్ : భారత ప్రభుత్వ మానవ వనరుల అభివృద్ధి శాఖ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన శిక్ష సప్తహ్‌లో భాగంగా రెండవ రోజు పునాది అభ్యసన, సంఖ్యాశాస్త్ర నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో భాగంగా విద్యార్థులను ఆటలు, కృత్యాల లో నిమగ్నం చేయడం.. కథల చెప్పడంలో మెలకువలు, బొమ్మలు ఆటల ద్వారా అభ్యసనం కార్యక్రమాలపై అవగాహన కలిగించారు. దీనికి సంబంధించి విద్యార్థుల చేత ఎఫ్ఎల్ఎన్ ప్రతిజ్ఞ చేయించడం చేయించారు. ఆరు నుండి తొమ్మిదవ తరగతి విద్యార్థులు సుమారు 40 మంది వివిధ సబ్జెక్టులలో నమూనాలను ప్రదర్శనగా ఉంచారు. పోస్టర్లు వివిధ రకాలైన కృత్యాలను అతి తక్కువ ఖర్చుతో భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయుడు ఏవి సుధాకర్ రూపొందించిన సుమారు 30 రకాలైనటువంటి వైజ్ఞానిక నమూనాలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు ఏవి సుధాకర్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.




# వైద్యున్ని కొనసాగించాలి




ఉదయగిరి, మేజర్‌న్యూస్ : ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న వైద్యుడు షంషుద్దీన్‌ను బదిలీ చేయకుండా వైద్యశాలలోనే కొనసాగించాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు డాక్టర్ వేణుగో పాల్, దస్తగిరిఅహ్మద్లు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే వైద్యశాలలో గైనకాలజిస్టు, జనరల్ మెడిసిన్, సర్జన్, చిన్న పిల్లల వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. మెట్ట ప్రాంతమైన ఉదయగిరిలో అధికశాతం మంది ప్రజలు ప్రభుత్వ వైద్యశాలలకు వెళుతుంటారన్నారు. వైద్యశాలలో ఉన్న వైద్యులను ఇతర ప్రాంతాలకు బదిలీ చేస్తే ఇక్కడికి వచ్చే వారు ఉండరన్నారు. దీంతో ప్రజలకు మెరుగైన వైద్యసేవలందక ఇబ్బందులు పడే అవకాశము ందన్నారు. షంషుద్దీన్ స్థానికుడు కావడంతో ప్రజలు ఏ సమయంలోనైనా అందుబాటులో ఉంటూ రోగులకు సేవలందిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బదిలీని నిలుపుదల చేసి ఇక్కడే సేవలు అందిం దేలా చర్యలు తీసుకోవాలని, లేదంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు పేర్కొన్నారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని వినతి

ఉదయగిరి, మేజర్‌న్యూస్ : పాఠశాల విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని మంగళవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు తహసీల్దారు నెహ్రూబాబు, ఎంపీడీవో ఈశ్వరమ్మ, ఎంఈవో-2 తోట శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ 117 జీవోను వెంటనే రద్దు చేసి ప్రాథమిక విద్యను కాపాడాలన్నారు. 3, 4, 5వ తరగతులను సమీప పాఠశాలల్లో విలీనం చేయడంతో పలువురు విద్యకు దూరమవుతున్నారన్నారు. అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్షా విధానం అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో అమలు చేసిన విద్యారంగ సంస్కరణల ఫలితంగా రాష్ట్ర విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల విశ్వాసం సడలిపోతుందని, పరిస్థితులు విషమించకముందే ప్రభుత్వం మేల్కొని పరిస్థితి చక్కదిద్దాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, ఫణిరాజ్, సుబ్బారెడ్డి, మున్నా, రామకృష్ణ ఖాదర్బాషా, విజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.



## నెల్లూరు జిల్లాలో మొత్తం 34 మంది తహసిల్దార్ల బదిలీ

### ఉత్తర్వులు జారీచేసిన జిల్లా కలెక్టర్




నెల్లూరు, మేజర్‌న్యూస్ : నెల్లూరు జిల్లాలో మొత్తం 34 మంది తహసీల్దార్లను బదిలీ చేసారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఆనంద్ మంగళవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికలకు ముందు వీరిని ప్రకాశం, బాపట్ల, గుంటూరు జిల్లా నుంచి నెల్లూరుకు మార్చారు. ఎన్నికలు ముగియడం సాధారణ పరిస్థితి రావడంతో తిరిగి తాసిల్దార్లను ప్రకాశం గుంటూరులోని సొంత మండలాలకు బదిలీ చేశారు.

## కృష్ణ మందిరంలో సత్యనారాయణ వ్రతం



నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ : నెల్లూరు నగరంలోని వేదపాలెం కృష్ణ మందిరంలో ఆషాఢ పౌర్ణమి సందర్భంగా సత్యనారాయణ స్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాసభగవానుడి జీవిత చరిత్రను సత్సంగంగా నిర్వహించగా ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసాచార్యులు ధర్మకర్త వెంకటేశ్వర్లు దేవస్థానం కమిటీ అధ్యక్షుడు రాఘవేంద్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాజు కోశాధికారి వేలూరు శ్రీనివాసులు ఉపాధ్యక్షుడు వేణుబాబు, భక్తులు పాల్గొన్నారు. సత్యనారాయణ స్వామి పూజ అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## జిల్లా అధికారులకు పవిత్ర గ్రంధాన్ని అందజేత



నెల్లూరు, మేజర్ న్యూస్ : నెల్లూరు బారా షహీద్ దర్గా పవిత్ర గంధాన్ని నెల్లూరు జిల్లా కలెక్టర్ ఆనంద్, జిల్లా ఎస్పీ మురళీకృష్ణ, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ తదితరులకు మంగళవారం అందజేశారు. రొట్టెల పండుగ నిర్వహణకు తమకు పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందించారని కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బారాషహీద్ దర్గా చైర్మన్ ఖాదర్ బాషా, కార్యదర్శి షేక్ మునీర్ బాషా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి

ఉదయగిరి, మేజర్ న్యూస్ : విద్యుత్ సరఫరాలో ఏలాంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని ఆత్మకూరు ట్రాన్స్కో డీఈ జనార్ధన్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక విద్యుత్ ఉప కేంద్రంలో ఉదయగిరి, సీతారామపురం, వరికుంటపాడు, దుత్తలూరు, మర్రిపాడు మండలాల సెక్షన్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వీస్తున్న గాలులకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండేలా చూడాలన్నారు. వినియోగదారులు తమ విద్యుత్ బిల్లులను డిజిటల్ పేమెంట్స్ ద్వారా చెల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ కోటేశ్వరరావు. పలు మండలాల ఏఈలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.